## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ ముత్యాలంపాడు ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చల్లపల్లి వారి వీధి, జీఎస్ రాజు రోడ్డు, రాణాప్రతాప్ రోడ్డు, కొమ్ము వారి వీధి, బ్రహ్మయ్య పంతులు వీధి, సుమాణం వారి వీధి, అమలి స్కూల్ ఏరియా, మారుతీ వ్యాయామశాల, భగత్‌సింగ్‌రోడ్డు, జనార్ధన రావు వీధి, పాపరాజు వీధి,కనకరాజు వీధి, కావూరు వారి వీధి, నర్రా వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

### క్రీడల్లో రాణించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని శ్రీ చైతన్య కళాశాల డీన్ హరిబాబు సూచించారు. ఏలూరు రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాలలో సోమవారం ఇటీవల తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన ఉప్పు శ్యాంకుమార్ అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోకర్ణేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ బాలికలకు పాఠ్య పుస్తకాలు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ పాఠశాల ప్లస్‌లో ఇంటర్ బాలికలకు టెక్స్ట్ బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ నడకుదిటి పుష్ప, హెచ్ఎం బి.పద్మలత బాలికలకు పుస్తకాలను అందజేశారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పిల్లలు ప్రయోజకులైతే తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకుని చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు పర్యవేక్షించారు.

### ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో సోమవారం సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు. గ్రామంలోని శివాలయం పల్లాలు, ఎస్సీ కాలనీ, కాల్వగట్టు ప్రాంతం, కేవీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు పూడికతీసి, అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగిస్తున్నట్లు చెప్పారు. రామయ్య చెరువు సమీపంలోని ఆ ప్రాంత నివాసితులు చెత్త డంపింగ్ చేయకుండా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాంతంలోని చెత్తనంతటినీ తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించామన్నారు. పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

### చేపలచెరువుల వేలం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లయ్యచెరువు, ఎర్ర చెరువుల్లో 2024-25 నుంచి 2026-27 వరకు చేపలను పట్టుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ సోమవారం వేలం పాటను నిర్వహించారు. పుల్లయ్య చెరువును రూ.3.24 లక్షలకు ఆవల కోటయ్య వేలం పాడగా, ఎర్ర చెరువును రూ.2.26 లక్షలకు పలగాని యేసుబాబు వేలం పాట పాడారు. వేలం మొత్తాన్ని చెల్లించేలా షరతులకు లోబడి నిర్వహించారు. బహిరంగ వేలంలో గ్రామస్తులు యర్కారెడ్డి నాగిరెడ్డి, యర్కారెడ్డి కోటిరెడ్డి, మాదు శివరామ ప్రసాద్, దేవులపల్లి సతీష్, గుంటక సుబ్బారెడ్డి, మురళీ పాల్గొన్నారు.

# నెరవేరిన కల

- తీరిన రైల్వేగేటు కష్టాలు
- అందుబాటులోకి మధురానగర్ ఆర్‌యూబీ
- తుదిదశకు సర్వీస్ రోడ్డు పనులు



పూర్తి కావచ్చిన సర్వీస్ రోడ్డు పనులు



మధురానగర్ వద్ద ఆర్‌యూబీలో రాకపోకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వాసుల కల నెరవేరింది. వారికి రైల్వే గేటు కష్టాలు తప్పాయి. గతంలో ఇక్కడ రైల్వేగేటు పడితే వాహనచోదకులు నానాయాతన పడేవారు. తరచూ రైల్వే గేటు పడుతుండటంతో ఐదో డివిజన్ వాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొనేవారు. వీరి రైల్వేగేటు కష్టాలు తప్పించేందుకు మధురానగర్‌లో రూ. 22 కోట్ల అంచనాతో ఆర్‌యూబీ పనులు ప్రారంభించారు. కోవిడ్ సాంకేతిక సమస్యలతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో నాటి ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అధికారులతో మాట్లాడి ఆర్‌యూబీ పనులు పూర్తిచేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికలకు ముందే అధికారులు ఆర్‌యూబీని ప్రారంభించారు.

**తుదిదశకు..**

ప్రస్తుతం సర్వీసు రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇక్కడ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా స్ట్రీట్‌లైట్‌లు ఏర్పాటు చేశారు. ఆర్‌యూబీ వినియోగంలోకి రావడంతో మధురానగర్, పసుపుతోట, బుడమేరు మధ్యకట్ట, భానునగర్, గులాబీతోట, దేవీనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సమస్య పరిష్కరించాం



దశాబ్దాల కలగా మిగిలిన మధురానగర్ ఆర్‌యూబీ నాటి ఎమ్మెల్యే విష్ణు శ్రద్ధ పెట్టడంతో పూర్తైంది. ఇక్కడ ట్రాఫిక్ పెరగటంతో తరచూ గేటు వేస్తుండటంతో విలువైన సమయంతో పాటు ఇంధనం వృథా అయ్యేది. ఇప్పుడు ఆర్‌యూబీ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించగలిగాం.

–కొంగితల లక్ష్మీపతి, 29వ డివిజన్ కార్పొరేటర్

# మళ్లీ ప్రారంభించారు

**కాపు కమ్యూనిటీ హాలును తిరిగి ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమా**



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు



కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవంలో నాటి ఎమ్మెల్యేలు విష్ణు, వెల్లంపల్లి (ఫైల్)

సాక్షి, విజయవాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.25కోట్లతో సర్వహంగులతో నిర్మించి ప్రారంభించిన కాపు కమ్యూనిటీ హాలును సోమవారం స్థానిక టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు శిలాఫలకం లేదంటూ ఏర్పాటు చేసి మళ్లీ ప్రారంభించారు. అభివృద్ధి పనులు చేసి గర్వంగా చెప్పుకునే రాజకీయ నాయకులుంటారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించిన కాపు కమ్యూనిటీ హాలును ప్రారంభించామని ఇకనుంచి వినియోగించుకోవచ్చని చెప్పుకోవడం మరి ఇంత దిగజారుడుతనమని ప్రజలు నవ్వుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు 2020లో 62వ డివిజన్లో కాపు కమ్యూనిటీ హాలును మంజూరు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండం అందజేశారు. ప్రభుత్వం కోటి రూపాయలను కాపు కార్పొరేషన్ నుంచి నిధులను మంజూరు చేసింది. 2023 ఫిబ్రవరి 23న వంగవీటి మోహనరంగా కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఏడాది కాలంలోనే సర్వహంగులతో మరో 25 లక్షలు హెచ్చించి మొత్తం రూ.1 25 కోట్లతో హాలు నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభించారు. ఆ సందర్భంలో శిలాఫలకం ఏర్పాటు చేయలేదని, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు రాధారంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీనివాసరావు, విజయకృష్ణ సూపర్‌బజారు మాజీ చైర్మన్ అడపా నాగేంద్ర, కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి కాపు కమ్యూనిటీ హాలుకు శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు.

**కాపుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రాధాన్యం: మల్లాది విష్ణు**

కాపుల సంక్షేమానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఐదేళ్లలో అక్షరాల రూ.39.317 కోట్ల నిధులు కాపుల అభ్యున్నతికి ఖర్చు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. సెంట్రల్‌లో కాపు నేస్తం పతకం ద్వారా నాలుగు విడతలలో 2,583 మందికి రూ. 12.74 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో కాపు కల్యాణ మండపాన్ని కేవలం జీవోలకే పరిమితం చేశారని మల్లాది విష్ణు విమర్శించారు.

## ఆధ్యాత్మిక గురువు 'పసుమర్తి'కి కన్నీటి వీడ్కోలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆధ్యాత్మిక గురువు పసుమర్తి కామేశ్వరశర్మ అని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. అయోధ్యనగర్ ఇందిరాఎన్క్లేవ్‌లోని అధ్యాత్మిక ప్రవచకుడు పసుమర్తి కామేశ్వర శర్మ (80)పార్థివదేహాన్ని సోమవారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. స్థానిక కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు కామేశ్వరశర్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అయోధ్యనగర్ ఇందిరా ఎన్క్లేవ్ ఓనర్స్ సంఘ నేతలు కన్నీటి వీడ్కోలు పలికారు.

## వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలి: వైవీబీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో 27, 28 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను సోమవారం ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్, కౌన్సిలర్, కార్పొరేటర్, చైర్మన్, మేయర్ ఒక నెల గౌరవ వేతనాన్ని అమరావతి అభివృద్ధికి విరాళంగా ఇవ్వాలని తీర్మానించారన్నారు. వారి గౌరవ వేతనాన్ని ప్రతి నెలా వారి బ్యాంక్ ఖాతాలో వేయాలని, గతంలో మాదిరే గ్రామాలలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు కేంద్ర ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సంవత్సరంలో ఒక రోజు తిరుమల దర్శనానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ తీర్మానించామన్నారు. 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అందజేసి పరిష్కరించాలని కోరాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందాలి

మైలవరం: హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్ వంటి ప్రాథమిక భాషలతో పాటు రియాక్ట్.జేఎస్ వంటి ఫ్రేమ్ వర్క్‌లు నేర్చుకోవాలని, ఈ కొత్త నైపుణ్యాలు వెబ్ డెవలప్‌మెంట్‌లో మరింత నైపుణ్యంగా మారడానికి సహాయ పడతాయని ఎల్‌బీఆర్‌సీఈ స్టూడెంట్ బ్రాంచ్ ఇన్‌చార్జి, భావరాజు సాయి శశాంక ఇన్ఫోస్టెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎస్. నాగాంజనేయులు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వారం రోజులు శిక్షణా కార్యక్రమం సోమవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో విద్యార్థులు వెబ్ డెవలప్‌మెంట్ ప్రాథమికాలు, ఆధునిక సాంకేతికతల వరకు వివిధ అంశాలపై అవగాహన కల్పించామని వివరించారు. కార్యక్రమంలో ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి. శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్స్‌గా హేమలత, సాంబశివరావు, శ్రీకృష్ణారెడి, విద్యార్థులు పాల్గొన్నారు.

# అడిగోపుల మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు



మాట్లాడుతున్న భవానీదేవి, వేదికపై డాక్టర్ జీవీ పూర్ణచందు, అరసవిల్లి కృష్ణ

విజయవాడ కల్చరల్: సాహితీవేత్త, పరిశోధకుడు అడిగోపుల వెంకటరత్నం మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటని ఏపీ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ భవానీదేవి అన్నారు. రచయితల సంఘం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభను నిర్వహించారు. భవానీదేవి మాట్లాడుతూ తన కవిత్వం ద్వారా అడిగోపుల యువకవులను ప్రోత్సహించినట్లు తెలిపారు. రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ మాట్లాడుతూ 1984లో సూర్యోదయం కవితా ప్రస్థానం ప్రారంభమైందని ఆయన జీవితాంతం సాహితీ వికాసానికి కృషి చేశారని ఏపీ రచయితల సంఘం గౌరవ సలహాదారునిగా విశేషమైన సేవలను అందించారన్నారు. 27 కవితా సంపుటులు వెలువరించినట్లు తెలిపారు. సభలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరవల్లి కృష్ణ సాహితీ సంస్థల ప్రతినిధులు చలసాని అజయ్‌కుమార్, ఓరా ప్రసాద్ అడిగోపల వెంకటరత్నం సాహితీ సేవలను వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్‌వీఎస్ఎస్ శర్మ, బోడి ఆంజనేయరాజు, విద్యావేత్తలు గుమ్మా సాంబశివరావు, పుష్పాదేవి, అనిల్ డ్యాని, నన్నపనేని నాగేశ్వరరావు అడిగోపులతో అనుబంధం గుర్తు చేసుకున్నారు.

# నాణ్యమైన ఆహారం అందించాలి



బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్లో అన్నం పరిశీలిస్తున్న కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): నాణ్యమైన ఆహార పదార్థాలను విద్యార్థులకు పెట్టాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ వంట ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. సోమవారం డివిజన్లో బీవీ సుబ్బారెడ్డి నగరపాలకసంస్థ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకంలో తయారుచేస్తున్న ఆహారపదార్థాలను కార్పొరేటర్ తిరుపతమ్మ తనిఖీ చేశారు. కొందరు స్థానికులు కుళ్లిన కోడిగుడ్లు పిల్లలకు పెడుతున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేసి విద్యార్థులకు పెట్టాలన్నారు. హెచ్ఎం బి.దుర్గారావు, సచివాలయ అడ్మిన్ రాజు, ఎడ్యుకేషన్ సెక్రెటరీలు గంటయ్య, రమేష్ ఉన్నారు.

# ఫుట్‌పాత్‌కు మరమ్మతులు

సాక్షి స్పందన



మధురానగర్లో ఫుట్‌పాత్‌కు మరమ్మతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు వీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ నుంచి దేవీనగర్ వంతెన ఫుట్‌పాత్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ ఫుట్‌పాత్ ప్రమాదకరంగా మారటంతో స్థానికుల అవస్థలను వివరిస్తూ 'సాక్షి' శుక్రవారం 'ప్రమాదకరంగా ఫుట్‌పాత్' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించడం. పాడైన ఫుట్‌పాత్‌కు మరమ్మతులు పూర్తిచేశారు.

# చివరి అంకానికి ఆషాఢ ఉత్సవాలు



సారె సమర్పిస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఆషాఢ మాసోత్సవాలు ఆగస్టు 4వ తేదీతో ముగియనున్నాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పిస్తున్నాయి. సోమవారం ఏలూరు నుంచి డాక్టర్ రేవతి బృందంతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని శ్రీదుర్గ శివసాయి సేవా బృందానికి చెందిన 150 మంది, శ్రీభ్రమరాంబికా సేవా సమితికి చెందిన 90 మంది, శ్రీశివాలలితా మండలి బృందానికి చెందిన 70 మంది, బాపట్ల నుంచి విచ్చేసిన ఝాన్సీలక్ష్మి బృందానికి చెందిన 70 మందితో పాటు నగరానికి చెందిన పలువురు భక్తులు, భక్త బృందాలు సారెను సమర్పించాయి.

# అంతరిక్ష రంగంలో భారత్ అపూర్వ ప్రగతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం అపూర్వమైన ప్రగతిని సాధించిందని షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'భారత అంతరిక్ష ప్రయాణం' అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధనా రంగంలో దూసుకువెళ్లడంతో శాస్త్రీయ పురోగతికి, దేశ ఆర్థిక సామాజిక ప్రగతికి అండగా నిలిచిందన్నారు. 1969 ఇస్రో స్థాపనతో భారత అంతరిక్ష యాత్రకు పునాది పడిందన్నారు. 1975లో మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను పంపారన్నారు. టెలికమ్యూనికేషన్స్, బ్రాడ్‌కాస్టింగ్, పర్యావరణ, వైద్యారోగ్యం అనేక అంశాల్లో భారతీయ అంతరిక్ష పరిశోధనలు అండగా నిలుస్తున్నాయన్నారు. మానవ సహిత అంతరిక్ష యాత్ర, చంద్రయాన్ -3 వంటి పలు అంశాలపై ఆయన ఉత్తేజపూర్వక ప్రసంగం చేశారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు ఏహెచ్‌డీ ప్రకాష్, మౌనిక, శృతి పాల్గొన్నారు.

# నగరవాసుల ఆరోగ్యం పెంపునకు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని మరింత అందంగా, సుందరంగా మార్చడానికి నగరవాసుల ఆరోగ్యాన్ని పెంచేలా గ్రీనరీని పెంపొందించాలని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ప్రకాశం బ్యారేజ్, ఫ్లైఓవర్, ఎంజీ రోడ్డులో క్షేత్రస్థాయిలో నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ, గ్రీనరీని పరిశీలించారు. నగరాన్ని మరింత అందంగా ఆహ్లాదంగా మార్చేందుకు మొక్కలను నాటాలని, వాల్ పెయింటింగ్‌లను వేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే బ్యానర్లను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశించారు. కనకదుర్గ ఫ్లైఓవర్ వాల్ పెయింటింగ్స్ వేసేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశాలు ఇచ్చారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద ప్రజలకు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. నగరంలో, డివైడర్లపై మొక్కలని మరింత పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌కు ఆదేశాలు ఇచ్చారు. అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ మహేష్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ వన్ రమ్య కీర్తన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 1 ఏఎస్ఎన్ ప్రసాద్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ చీరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 2 శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# ఉచిత కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ముత్యాలంపాడు గోకుల వీధిలోని అజయ్ హైస్కూల్లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీమ్ ఆధ్వర్యాన డీసీ అప్పన వెంకట సత్యసాయిబాబు అప్పన వెంకట మధురవాణి సహకారంతో ఉచిత కుట్టుశిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి లయన్స్ క్లబ్ గవర్నర్ గద్దె శేషగిరితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ అన్నే సాంబశివరావు, క్లబ్ సభ్యులు జీఎంటీ కోఆర్డినేటర్ మద్దినేని చక్రధర్, అడిషనల్ క్యాబినెట్ కార్యదర్శి ఆలమూరి అమరనాథ్ , పెనుమత్స అప్పలరాజు, జోన్ చైర్మన్ పల్లెటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# సుజనాతో ఎటువంటి గొడవలు లేవు

**మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న**

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరితో తనకు ఎటువంటి గొడవలు లేవని మాజీ ఎమెల్సీ, టీడీపీ నేత బుద్దా వెంకన్న అన్నారు. 'నా దందాల జోలికి రావద్దు' శీర్షికన సాక్షి మెయిన్‌లో వచ్చిన కథనంపై బుద్దా వెంకన్న స్పందించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సుజనాచౌదరి కృష్ణా జిల్లాకు ఇన్‌చార్జిగా ఉన్నప్పటి నుంచి ఆయనతో అనుబంధం ఉందన్నారు. తనను టీడీపీ నగర అధ్యక్షుడిని చేసింది సుజనానే అని చెప్పారు. అనేక అంశాల్లో కేశినేని నాని తనను వ్యతిరేకించినా సుజనా ప్రోత్సహించారని చెప్పారు. నా జీవితంలో నేను ఆయనతో ఎప్పుడూ గొడవ పడనని చెప్పారు.

**బుద్దా దందాలపై లోకేష్ ఆరా**

'నా దందాల జోలికి రావద్దు' పేరుతో వచ్చిన కథనంపై టీడీపీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆరా తీసినట్లు తెలిసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బుద్దా వెంకన్న చేస్తున్న దందాల పేరుతో పత్రికల్లో వస్తున్న కథనాలపై నగరానికి చెందిన పలువురు నాయకులు టీడీపీ అధిష్టానానికి వివరించినట్లు సమాచారం. ఈ అంశాలపై పార్టీ అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.

## ఘాట్ రోడ్డు వద్ద రక్షణ చర్యలు



దుర్గమ్మ కొండ ఘాట్ రోడ్డు సమీపంలో కొండ చరియలు విరిగి పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా సంబంధిత సిబ్బంది కొండ చరియల వద్ద రక్షణ చర్యలు తీసుకుంటున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ

## బ్యారేజీ గేట్ల వద్ద పేరుకున్న గుర్రపుడెక్క



ఇటీవల కురిసిన వర్షాలకు ప్రకాశం బ్యారేజ్ గేట్ల వద్దకు గుర్రపుడెక్క భారీగా కొట్టుకొచ్చింది. ప్రధాన కాల్వ నుంచి దిగువకు నీరు పారుతున్నా గేట్ల వద్ద అధిక సంఖ్యలో గుర్రపుడెక్క నిలిచి ఉన్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ